క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉమామహేశ్వరిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఓర్వకల్లు : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉమామహేశ్వరి పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమె సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఉమా మహేశ్వరి నిబద్ధతతో, అంకిత భావంతో పనిచేశారని కొనియాడారు. అనంతరం ఉమామహేశ్వరి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నీటిని పంపిణీ చేస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు : తాగునీటిని వృథా చేయవద్దని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విద్యాసాగర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ప్రజలకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. నిత్యం కార్యాలయ పనిమీద వందల మంది ప్రజలు రాకపోకలు చేస్తుంటారని, వారిని దృష్టిలో పెట్టుకొని పాత్రికేయుడు మునిస్వామి ఎంతో వ్యయప్రయాసలకోర్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రజలకు తాగునీరు పంపిణీ చేశారు.

నేడు చెన్నకేశవస్వామి కల్యాణం

కోడుమూరు రూరల్: గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. కల్యాణం అనంతరం సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు ఉంటుందన్నారు.

'పది' పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షకు శనివారం ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌లో ఐదుగురు, మోడల్ స్కూల్‌లో ఇద్దరు విద్యార్థులకు గైర్హాజరయ్యారన్నారని పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు మల్లయ్య, వంశీమోహన్ తెలిపారు. కాగా సోమవారం నిర్వహించాల్సిన పదో తరగతి సోషల్ పరీక్ష రంజాన్ సందర్భంగా మంగళవారానికి వాయిదా వేసినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు.

సారా పాత నేరస్తులపై బైండోవర్ కేసులు

కర్నూలు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలం కొల్లంపల్లితాండ గ్రామానికి చెందిన నాటుసారా తయారీదారులు 26 మంది పాత నేరస్తులపై ఎక్సైజ్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేసి కల్లూరు ఇన్‌చార్జి తహసీల్దార్ శివరాం ఎదుట హాజరుపరిచారు. ఎంపీడీఓ నాగేషాచలరెడ్డితో కలసి తహసీల్దార్ వారికి కౌన్సిలింగ్ ఇచ్చి గ్రామ కమిటీ తీర్మానం మేరకు వారిని బైండోవర్ చేస్తూ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, ఎస్‌ఐ దుర్గా నవీన్ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మధు తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట ప'రేషన్'

- కందిపప్పు సరఫరాలో కూటమి సర్కార్ విఫలం
- రేషన్ దుకాణల్లో పూర్తిగా నిలిపివేత
- మూడు నెలల నుంచి బియ్యం, పంచదారతోనే సరి..

ఉగాది, రంజాన్ చేసుకోవాలంటేనే సామాన్య ప్రజలు భయపడుతున్నారు. తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగల్లో ఉగాది ఒకటి. మరోవైపు ముస్లింలకు ముఖ్యమైన పండుగ రంజాన్. రెండు పండుగలూ ఒకేసారి రావడంతో ఆయా వర్గాల ప్రజలు ఒకపక్క సంతోషం వ్యక్తం చేస్తుండగా మరోపక్క నిత్యావసర ధరలను చూసి ఆందోళన చెందుతున్నారు.

– కర్నూలు(రూరల్)



కర్నూలు మండలంలో 25,942 రేషన్ కార్డులు ఉన్నాయి. 46 చౌక దుకాణాలు ఉన్నాయి. 18 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. కోడుమూరు నియోజకవర్గంలో కర్నూలు మండలం ఎక్కువ జనాభా ఉన్న మండలం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. నిత్యావసరాలను రాయితీపై అందిస్తామంటూ అప్పటి ప్రతిపక్షంలో ఉన్న నాయకలు ఎన్నికల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. నిజమేనని నమ్మిన ప్రజలకు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు చుక్కలు చూపిస్తోంది. రాయితీ సరుకుల మాట అటుంచి ఉన్నవాటిలోనే కోత విధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి తాను మోసకారినని ఇక బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా నియంత్రించడంతో పూర్తిగా విఫలమయ్యారు.

కందిపప్పు పంపిణీకి బ్రేక్

ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో మార్చి నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోయిందని తెలుస్తోంది. ఈ నెలలో కందిపప్పు కోసం డీడీలు తీయవద్ద ని పౌరసరఫరాల శాఖ అధికారులు ముందుగానే సమాచారం ఇచ్చినట్లు డీలర్లు చెబుతున్నారు. రెండు నెలలుగా పూర్తి స్థాయిలో కందిపప్పు రాకపోవడంతో ఇదే అదునుగా తీసుకున్న కొందరు రేషన్ సరుకులను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు కోసం ఎండీయూ వాహనాల ఆపరేటర్లను అడుగుతుంటే నోస్టాక్ అనే సమాధానం వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా నిలిపివేయడంతో బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.150 వరకు పలుకుతోంది. దీంతో అంత ధర పెట్టి కందిపప్పు కొనలేమని, పండగ పూట కూడా పస్తులుండక తప్పదని హిందూముస్లింలు నిట్టూర్చుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



అతిపెద్ద పండుగ ఉగాదికి కూటమి ప్రభుత్వం కనీసం కందిపప్పు కూడా ఇవ్వకపోవడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. బియ్యంతో పాటు ఇచ్చే పంచదార, కందిపప్పు ఈ నెల ఇవ్వలేదు. అసలే మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం కూడా రేషన్ దుకాణాల ద్వారా సరుకులు సక్రమంగా అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వచ్చే నెల నుంచైనా అందరికీ కందిపప్పు ఇవ్వాలి.

– బోయ రమణమ్మ, ఉల్చాల గ్రామం, కర్నూలు మండలం

ప్రతినెలా ఇవ్వాలి



పవిత్ర రంజాన్ మాసంలో రంజాన్ తోఫా అందించడం లేదు. మార్కెట్లో కందిపప్పు కొనలేని పరిస్థితి ఉంది. పెరిగిన ధరల కారణంగా రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే కందిపప్పు, పంచదార పైనే ఆధారపడ్డాం. ఈనెల అవి రెండూ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ప్రతినెలా సరుకులను సక్రమంగా అందించాలి.

– షేక్ ఫర్హానా, ఇ.తాండ్రపాడు గ్రామం

అలాట్‌మెంట్ లేదు

కేంద్ర ప్రభుత్వం ద్వారా నాఫెడ్‌కు కందిపప్పు అలాట్‌మెంట్ జరిగితే అక్కడి నుంచి మేము సేకరించి రేషన్ షాప్‌ల ద్వారా కార్డుదారులకు అందజేస్తాం. ఫిబ్రవరిలో 30 శాతం రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందజేశాం. మార్చి, ఏప్రిల్ నెలలో కందిపప్పు రేషన్ కార్డుదారులకు అలాట్‌మెంట్ కాలేదు. ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

– నాగసుధ, సివిల్ సప్లయ్ మేనేజర్, కర్నూలు జిల్లా

బ్రాహ్మణదొడ్డిలో ప్రత్యేక పనులు

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ పంచాయతీలో సర్పంచ్ దస్తగిరి శనివారం ప్రత్యేక పనులను చేపట్టారు. ఆదివారం తెలుగు సంవత్సరాది, ఉగాది పండుగను పురష్కరించుకుని శనివారం ఆయన గ్రామంలోని ప్రధాన కూడళ్లలో చెత్తను తొలగించడంతోపాటు, మురుగు కాలువల్లో పూడికతీయించారు. మురుగు నీటి ఆవాసాల్లో దోమల మందును పిచికారీ చేయించారు.

చలివేంద్రం.. తూతూ మంత్రం



సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం చలివేంద్రం ఏర్పాటు చేశారు. రెండు మట్టి కుండల్లో నీళ్ల, ప్లాస్టిక్ పేపర్ గ్లాసులు ఏర్పాటు చేసిన అధికారులు నీళ్ల పోయడానికి ఎవరినీ నియమించకపోవడంతో మొక్కుబడిగా ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినిపించాయి.

కిటకిటలాడిన పండుగ సంత



సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ప్రజలతో కిక్కిరిసిన మెయిన్‌బజార్

కోడుమూరు రూరల్: ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో సంత కిటకిటలాడింది. పట్టణంతోపాటు సమీప గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు, కిరాణం, దుస్తుల కొనుగోలు నిమిత్తం తరలిరావడంతో దుకాణాలన్నీ కిక్కిరిశాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పండుగ సంత బహు ఖరీదుగా మారింది. పెరిగిన ధరలతో చిన్న కుటుంబానికి కూడా పండుగ ఖర్చు రూ.10 వేలకు పైనే వస్తోంది.

వల్లెలాంబ ఉత్సవాలు ప్రారంభం

- నేడు రథోత్సవం

కోడుమూరు రూరల్: స్థానిక హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి తిరునాల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, గంగ పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ధర్మకర్త పూల వాసు ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం రాత్రి అమ్మవారి ప్రభోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, సభ్యులు సాలప్ప, రంగన్న, గిడ్డయ్య, నాగన్న, రామకృష్ణ, తిమ్మప్ప, మాదన్న పాల్గొన్నారు.



వల్లెలాంబదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నేడు అమ్మవారి రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా ఉగాది పర్వదినమైన ఆదివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి శనివారం తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



వాహనదారుడికి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కర్నూలు రోడ్డులో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన ఉండాలి

ఓర్వకల్లు : రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి వుండాలని రూరల్ సీఐ చంద్రబాబునాయుడు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీఐ చంద్రబాబు నాయుడుతో పాటు స్థానిక ఎస్‌ఐ సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సుతో పాటు, హెల్మెట్‌ను ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పాండురంగస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రబాబు నాయుడు

తేనె టీగల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయ్‌రాయ్

పాణ్యం: తేనె టీగల పెంపకంతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన, కీటక శాస్త్రం శాస్త్రవేత్త విజయ్‌రాయ్ అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం బలపనూరు మెట్ట వద్ద ఉన్న నల్లమల బీ హనీ పార్క్‌లో తేనే తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో తేను టీగలను ఎలా పెంచాలి, వాటి నుంచి వచ్చే ఉప ఉత్పత్తులు తేనె, పుప్పొడి, మైనం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అలాగే తేనే తయారవ్వడానికి కావల్సిన ప్రదేశాలు, వాటి పోషణను నల్లమల బీ హనీ పార్క్ నిర్వహకులు రమేష్, ఇలియాస్ వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆశోక్‌కుమార్, మోహన్, విష్ణువర్ధన్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై పారా లీగల్ వలంటీర్లు అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(సెంట్రల్): క్షేత్ర స్థాయిలోపనిచేసే పారా లీగల్ వలంటీర్లు భారత శిక్షాస్మృతి, ఇతరచట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ సూచించారు. శనివారం న్యాయ సేవాసదన్‌లో పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కోసం సదస్సునును ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పారా లీగల్ వలంటీర్లు న్యాయసేవలు, న్యాయ సేవలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసుల విజయలక్ష్మి, శక్తి ఎస్‌ఓపీ యాప్, పిల్లలు సెల్‌ఫోన్ వాడకంతోకలిగే అనర్ధాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న వెంకట లీలా వెంకట శేషాద్రి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కల్లూరు: వాహన దారులందరూ తప్పని సరి గా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయ డ్రైవర్లకు సూచించారు. శనివారం రోడ్డు భద్రత నియమల పై వాహనదారులతో సమావేశం నిర్వహించా రు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారు లు కచ్చితంగా హెల్మెట్, కారులో ప్రయాణం చేసే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం బీసీ కాలనీకి చెందిన బోయ బాలవెంకటేశ్వర్లు(43) శనివారం తెల్లవారుజామును గుండె పోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స చేయించుకుని కర్నూలు పెద్దాస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా కోలుకోలేక ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ తదితరులు ముందుగా ఎన్టీఆర్ సర్కిల్, అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు



పారిశుద్ధ్య కార్మికులకు దస్తులు పంపిణీ చేసిన కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలందరికీ తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి సహకారంతో శనివారం 29, 30, 31వ వార్డులకు చెందిన 64 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆయన స్వగృహంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పండగకు ముస్తాబైన ఆలయాలు

కల్లూరు: కోరికలు తీర్చే కొంగు బంగారం శ్రీ చౌడేశ్వరీ మాత దేవి కల్లూరులో వెలసింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారి ఉత్సవాలు జరుగనున్నాయి. రెండురోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయి. ఆచారం ప్రకారం ఆలయం చుట్టూ నీళ్ల నింపి బురదగా మార్చుతారు. పండుగ రోజు సాయంత్రం భక్తులు, రైతులు ఎద్దుల బండ్ల ప్రదక్షణ చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి భక్తులు తయారు చేసిన జ్యోతుల ఉత్సవం ప్రారంభమవుతుంది.

పాణ్యం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలలకు రంగులు వేసి, విద్యుత్ కాంతులతో అలంకరించారు. మండల కేంద్రమైన పాణ్యంలోని సుంకులాపరమేశ్వరి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. చెంచుకాలనీలో సర్వీస్ రోడ్డు మొదలుకొని ఆలయం వరకు రోడ్డుకిరువైపులా విద్యుత్ తొరణాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం గిరిజనులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.



విద్యుత్ కాంతుల అలంకరణలో సుంకులాపరమేశ్వరి ఆలయం

వెబ్‌సైట్‌లో ఫిర్యాదుల పరిష్కార ప్రొఫార్మాలు

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియలో అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కార పూర్తి ప్రొఫార్మాలను కర్నూలు వెబ్‌సైట్ https:// kurnool. ap. gov. in, https:// kurnoolmedicalcollege. ac. in లో ఉంచినట్లు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 29న ఇచ్చిన నోటిఫికేషన్‌లో మొత్తం 13 కేడర్లలో అత్యవసర సేవలకు సంబంధించి (మెడికల్ ఫిజిసిస్ట్, ఓటీ అసిస్టెంట్, అనెస్థీషియా టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్) అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కార ప్రొఫార్మాలను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఫిర్యాదులు పెట్టుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

ఎండలపై ప్రజలను అప్రమత్తం చేయండి

సి.బెళగల్: వేసవి ఎండల తీవ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం వీఆర్వోలను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎండలకు తిరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వడగాల్పులు, వడదెబ్బ, నీరసం వంటి ఆరోగ్య సమస్యలను తెలియజేసి, ముందస్తుగా తరచూ నీరు తాగడం, తలకు టోపీ ధరిచండ, తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్తే గొడుగు తీసుకెళ్లడం వంటి జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు.

టూరిజం స్థలం అభివృద్ధికి ప్రణాళిక

పాణ్యం : మండల పరిధిలోని సుగాలిమెట్ట సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీ టూరిజం డివిజినల్ మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం టూరిజం శాఖకు కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. తమకు కేటాయించిన స్థలానికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని శాంతిరామ్ ఆసుపత్రి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు అధిగమించబోయి ఢీకొంది. ఈ ఘనటలో ట్రాక్టర్ డ్రైవర్ మౌలాలి, మహబూబ్‌నగర్‌కు చెందిన కార్తీక్, కడపకు చెందిన దుర్గాప్రసపాద్‌లకు గాయాలుకాగా.. చికిత్స నిమిత్తం శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు.

పబ్లిక్ పార్క్‌లో టీడీపీ జెండావిష్కరణ

సి.బెళగల్: టీడీపీ నాయకులు, కార్యకర్తల అత్యుత్సాహంతో పబ్లిక్ పార్క్‌లో పార్టీ జెండాలను పాతేశారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ అభివృద్ధి నిధుల్లో భాగంగా 2019లో మండల కాంప్లెక్స్ స్థలంలో పబ్లిక్ పార్క్‌ను నిర్మించారు. అనంతరం పార్క్ నిర్వహణను పంచాయతీకి అప్పగించారు. 2019 నుంచి ఇప్పటి వరకు పార్క్ పంచాయతీ ఆధ్వర్యంలో ఉండగా శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పార్క్‌లో ఏకంగా పార్టీ జెండాను పాతి ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులను రాజకీయ పార్టీలకు వినియోగించరాదన్న విషయాన్ని విస్మరించి టీడీపీ నేతలు ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.